రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం నాదర్‌గుల్ గ్రామ పరిధిలోని లావణి పట్టా భూములు


15 It is also further expressly made clear that the entire expenditure relating to permission of case or ... other expenditure shall be borne only by the Second part. In other words, the First party shall not be responsible for such expenditure.

16 That the First part agrees to give possession and do the AGPA (Additional General Power of Attorney) of the land in clear manner excludes any Kabza etc. Once the land gets new passbooks and NOC any Other Issues regarding land other than Revenue Work will be borne by the First part.

SCHEDULE OF PROPERTY

All that the agriculture dry land:-

SURVEY NO.	EXTENT IN ACRES
92/a	[redacted]
TOTAL EXTENT	[redacted]

SITUATED AT GURRAMGIDA VILLAGE, NADARGUL (RURAL), BALAPUR MANDAL, RANGAREDDY DIST, TELANGANA, Bounded by:

NORTH :
SOUTH :
EAST :
WEST :
[redacted]

IN WITNESSES WHEREOF, the First part and Second part have signed on this Agreement of Development, with free will and consent on this the day, month and year first ...

WITNESSES:
1. [redacted]

[redacted]
Second Part
(N Praveen Reddy)

4

ల్యాండ్ పూలింగ్ కోసం రైతులతో చేసుకున్న ఒప్పంద పత్రం

లోకం పోకడ



బిగ్ బ్రదర్స్.. ల్యాండ్ పూలింగ్

- నాదర్‌గుల్‌లో 290 ఎకరాలపై కన్ను
- లావణి పట్టా భూములకు ఎసరు
- కేసీఆర్ సర్కార్‌లో ల్యాండ్‌పూలింగ్‌కు కసరత్తు చేసిన హెచ్‌ఎండీఏ
- రైతులతో చర్చల విఫలంతో వాయిదా
- తాజాగా బిగ్ బ్రదర్స్, బంధువుల ఎంట్రీ
- అనధికారికంగా ల్యాండ్ పూలింగ్
- రైతులతో అతుల్యం హోమ్స్ ఒప్పందం
- సర్కారు పెద్ద బంధువులే హోమ్స్ డైరెక్టర్లు
- వ్యవహారంలో కాంగ్రెస్ పెద్ద.. ఓ ఎంపీ

(స్పెషల్ టాస్క్‌బ్యూరో)

ఫోర్త్ సిటీ పేరుతో ప్రభుత్వ పెద్దలు వేలాది ఎకరాల అసైన్డ్, సీలింగ్ భూములను చెర పడుతుండగా.. తాజాగా మరో 300 ఎకరాల వరకు లావణి పట్టా భూములు కార్పొరేట్ పరమయ్యేందుకు రంగం సిద్ధమవుతున్నది. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం నాదర్‌గుల్ గ్రామంలోని సర్వేనంబరు 92లో సుమారు 291.32 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. ఇందులో కొంత భూమిని కొన్ని దశాబ్దాల కిందటే గ్రామానికి చెందిన నిరుపేదలకు పంపిణీ చేశారు. వారికి లావణి పట్టాలు కూడా ఇచ్చారు. ప్రస్తుత రెవెన్యూ రికార్డుల ప్రకారం 74 మంది రైతులకు సుమారు 40 ఎకరాలకు సంబంధించి లావణి పట్టాలు ఉన్నాయి. వీరిలో కొందరికి పాస్ పుస్తకాలు జారీ కాగా.. మరికొందరికి కాలేదు. మిగిలిన 270 ఎకరాల వరకు ప్రభుత్వం ఖాతాలో ఉన్నా క్షేత్రస్థాయిలో చాలామంది రైతులు కబ్జా మీద ఉన్నట్టు తెలుస్తున్నది. ఇలా దాదాపు 200 మంది రైతుల వరకు ఈ భూముల్లో సాగు చేసుకుంటున్నట్టు తెలిసింది. గతంలో నగర శివారులో ఉన్న ఈ భూములు పట్టణీకరణ దరిమిలా చుట్టూ భారీ ఎత్తున నివాసాలు వచ్చాయి. ఇప్పుడు అనేక కాలనీల మధ్య ఈ భూములు ఉండటంతో చదరపు గజం విలువ రూ.40-50 వేలకు పైగా పలుకుతున్నది. అంటే ఎకరా సుమారు రూ.20-25 కోట్ల వరకు ఉంటుంది.

బీఆర్‌ఎస్ సర్కార్‌లో ల్యాండ్ పూలింగ్

పెద్ద పెద్ద కాలనీల మధ్య ఉండిపోయిన ఈ ప్రభుత్వ భూముల్లో వ్యవసాయం తగ్గిపోయింది. ప్రభుత్వ భూములు కావడంతో రైతులు వీటిని విక్రయించుకునే హక్కు లేదు. దీంతో కేసీఆర్ ప్రభుత్వంలో పరస్పర ప్రయోజనకరంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. వాస్తవానికి ప్రభుత్వం అనుకుంటే పీవోటీ కింద రైతుల నుంచి బలవంతంగా తీసుకొని సర్కారు ల్యాండ్ బ్యాంక్‌లో జమ చేయవచ్చు. కానీ కేసీఆర్ ప్రభుత్వం అలా కాకుండా హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో ల్యాండ్ పూలింగ్ చేయాలని భావించింది. హెచ్‌ఎండీఏ అధికారులు సైతం ల్యాండ్ పూలింగ్‌కు కసరత్తు చేశారు. ఈ భూములకు సమీపంలోనే ఉన్న కుర్మల్‌గూడలోని ప్రభుత్వ భూములను లేఅవుట్ చేసి వేలం పాటలో విక్రయించారు. అదేరీతిన ఈ భూములను అభివృద్ధి చేయాలని రైతులతో పలు దఫాలుగా సంప్రదింపులు జరిపారు. అభివృద్ధి చేసిన తర్వాత ఎకరాకు 500 చదరపు గజాల చొప్పున అభివృద్ధి చేసిన ప్లాట్లు రైతులకు ఇచ్చేందుకు హెచ్‌ఎండీఏ ప్రతిపాదించింది. కానీ రైతులు ఎకరాకు వెయ్యి గజాల చొప్పున కావాలని డిమాండ్ చేశారు. దీంతో ప్రక్రియలో స్తబ్ధత నెలకొంది. ఈ క్రమంలో కొందరు రైతులు హెచ్‌ఎండీఏ ప్రతిపాదనకు అంగీకరించి పీవోటీ కింద ప్రభుత్వానికి సరెండర్ చేసేందుకు కూడా లిఖితపూర్వకంగా పత్రాలు ఇచ్చారు. మిగిలిన రైతులు అంగీకరించకపోవడంతో అధికారులు ముందుకు వెళ్లలేకపోయారు.

సర్కారు భూములపై వేలకోట్ల లాభం

బిగ్ బ్రదర్స్ కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ప్రభుత్వ భూములపై రూపాయి పెట్టి పది రూపాయల ప్రయోజనాన్ని పొందేందుకు స్కెచ్ వేశారని అర్థమవుతున్నది.

- బహిరంగ మార్కెట్ ప్రకారం.. ల్యాండ్ పూలింగ్ కింద లేఅవుట్లు చేస్తే అన్ని నిబంధనలు పాటించినా ఎకరాకు కనీసంగా 2200-2500 చదరపు గజాల అభివృద్ధి చేసిన స్థలం వస్తుంది.
- ఇందులో వెయ్యి గజాలు సదరు రైతుకు పోతే.. ఎకరాకు 1200-1500 గజాల వరకు మిగులుతుంది.
- ఎలాగూ హెచ్‌ఎండీఏ అనుమతులతో లేఅవుట్లు చేస్తారు గనుక కాలనీల మధ్య ఉన్న ఈ ప్రాంతంలో చదరపు గజానికి కనీసంగా రూ.60వేల వరకు ధర పలుకుతుంది. అంటే ఎకరాకు బిగ్ బ్రదర్స్‌కు వచ్చే మొత్తం రూ.7.20-9.00 కోట్లు.
- ఇలా సుమారు 290 ఎకరాలకు లెక్కిస్తే ఈ ప్రాజెక్టు ద్వారా వచ్చే మొత్తం రూ.2000-2600 వేలకోట్లు అవుతుంది.
- ఈ భూములకు ఎన్‌వోసీ.. అనుమతులు తేవడం.. లేఅవుట్ అభివృద్ధి, ఇలా అన్ని దశల్లో ఎంత ఖర్చు చేసినా రూ.1500 కోట్లకు పైగా మిగులుతుందనేది ఒక రియల్ నిపుణుడి విశ్లేషణ.

భూములపై బిగ్ బ్రదర్స్ నజర్

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ల్యాండ్ పూలింగ్ పెండింగ్‌లో పడింది. ఈలోగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ విలువైన భూములపై బిగ్ బ్రదర్స్ కండ్లు పడ్డాయి. దీంతో కొన్ని నెలలుగా సంబంధిత రైతులతో చర్చలు జరుపుతున్నారు. ఈ భూములను తమకిస్తే లేఅవుట్ చేసి ఎకరాకు రూ.10 లక్షలతో పాటు అభివృద్ధి చేసిన వెయ్యి గజాల ప్లాటు చొప్పున ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. కొందరు రైతులతో స్టాంపు పేపర్లపై ఒప్పందాలు కూడా చేసుకున్నారు. అంటే గతంలో ప్రభుత్వపరంగా హెచ్‌ఎండీఏ చేయాల్సిన ల్యాండ్ పూలింగ్‌ను సదరు బిగ్ బ్రదర్స్ అనధికారికంగా చేపడుతున్నారు. రెవెన్యూ రికార్డుల్లో కేవలం 74 మంది రైతుల పేర్లే ఉండగా కబ్జా మీద ఉండి రికార్డుల్లో పేర్లు లేని రైతులు చాలా మంది ఉన్నారు. వీరు ప్రస్తుతం తమ పేర్లను రికార్డుల్లోకి ఎక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నా అవి సఫలం కావడం లేదు. దీంతో రంగంలోకి దిగిన బిగ్ బ్రదర్స్ అండ్ కో పాస్ పుస్తకాల జారీ, భూములకు ఎన్‌వోసీలు తీసుకురావడమే కాకుండా అవసరమైతే రికార్డులను తారుమారు చేసే వ్యవహారాన్ని అంతా తామే చూసుకుంటామని ఒప్పందంలో పేర్కొన్నారు. ఒప్పందం పూర్తయిన రైతులకు అడ్వాన్స్‌గా రూ.2 లక్షల చొప్పున ఇచ్చిన బిగ్ బ్రదర్స్ ఎన్‌వోసీ, పాస్ పుస్తకాలు వచ్చిన తర్వాత మిగతా మొత్తాన్ని చెల్లించేలా హామీ ఇచ్చారు. లేఅవుట్ అభివృద్ధి చేసిన తర్వాత ఒప్పందం ప్రకారం ఎకరాకు వెయ్యి గజాల అభివృద్ధి చేసిన ప్లాటు ఇచ్చేలా ఒప్పందంలో పేర్కొన్నారు.

బిగ్ బ్రదర్స్ సమీప బంధువు కంపెనీపై ఒప్పందం

నాదర్‌గుల్‌లోని సర్వేనంబరు 92లో ఉన్న రైతులతో బిగ్ బ్రదర్స్‌తో పాటు మరికొంతమంది చర్చలు జరిపినట్టు తెలిసింది. ఇందులో ప్రధానంగా ప్రభుత్వ పెద్ద సోదరులు, నయీం అనుచరులు ఉన్నారు. రైతులతో ఒప్పందం మాత్రం 'అతుల్యం హోమ్స్' పేరిట చేసుకున్నారు. దీనికి డైరెక్టర్‌గా ఉన్న నందికొండ ప్రవీణ్‌రెడ్డి ఈ భూములను కొనుగోలు చేసినట్టుగా ఒప్పందంలో పేర్కొన్నారు. అతుల్యం హోమ్స్ అనేది 2020లో ఏర్పాటు కాగా.. దీనికి ప్రవీణ్‌రెడ్డితో పాటు ఆయన తండ్రి నర్సింహారెడ్డి డైరెక్టర్లుగా ఉన్నారు. ప్రవీణ్‌రెడ్డి బిగ్ బ్రదర్స్‌కు సమీప బంధువు అని తెలిసింది. కాగా నల్లగొండకు చెందిన వంశీచందర్‌రెడ్డి అనే వ్యక్తి కూడా కీలకపాత్ర పోషిస్తున్నట్టు సమాచారం. ఈయన నల్లగొండ జిల్లా మిషన్ భగీరథ విభాగంలో ఇంజినీర్‌గా పనిచేస్తున్న వ్యక్తి తనయుడిగా ప్రచారం జరుగుతున్నది. ప్రధానంగా కలెక్టర్‌తో మాట్లాడి రికార్డులను సర్దుబాటు చేయడం అనే కీలక బాధ్యతను వంశీచందర్‌రెడ్డి నిర్వర్తిస్తారని విశ్వసనీయ సమాచారం. వేలకోట్ల భూముల వ్యవహారం కావడంతో కాంగ్రెస్ పెద్దతో పాటు ఇటీవల విదేశీ పర్యటనకు వెళ్లి వచ్చిన కాంగ్రెస్ ఎంపీ కూడా తెరవెనక భాగస్వామిగా ఉన్నట్టు తెలిసింది. ఈ విషయాన్ని సదరు ప్రవీణ్‌రెడ్డి రైతులకు స్వయంగా చెప్పినట్టు విశ్వసనీయ సమాచారం.

ఈ ఒప్పందాలు లోకంలోనే వింత

సర్కారు భూములను కొల్లగొట్టేందుకు బిగ్ బ్రదర్స్ అసైన్డ్, లావణి పట్టా రైతులతో చేసుకుంటున్న ఒప్పందాలు విచిత్రంగా ఉన్నాయి. మాడ్గుల మండలంలోని కుందారం భూములను చెర పట్టేందుకు లోకంలోనే ఎక్కడాలేని విధంగా 'కబ్జా రద్దు ఒప్పంద పత్రాలు' తెరపైకి తెచ్చారు. తాజాగా నాదర్‌గుల్ భూముల వ్యవహారంలో చేసుకున్న ఒప్పందంలోని అంశాలు కూడా విస్మయాన్ని కలిగిస్తున్నాయి. అందులోని కొన్ని ప్రధానాంశాలు...

- రెవెన్యూ, ఇతర శాఖల అధికారులను డీల్ చేసి తమ లావణి పట్టా భూములకు పాస్‌పుస్తకాలు, ఎన్‌వోసీ తీసుకురావడంలో రైతులు విఫలమయ్యారు. అనేకసార్లు వాళ్లు ప్రయత్నించి సఫలీకృతం కాకపోవడంతో ఆ బాధ్యతను సదరు కంపెనీ (అతుల్యం హోమ్స్)కి అప్పగించారు.
- భూములకు సంబంధించి ఇక నుంచి రెవెన్యూ శాఖ పరంగా గాని న్యాయ పరంగా గాని ఎలాంటి వ్యవహారాలైనా కంపెనీ చూసుకుంటుంది.
- రైతులకు సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో ఎంత విస్తీర్ణం ఉందనేది ప్రామాణికంగా కాకుండా కంపెనీ వాళ్లు క్షేత్రస్థాయిలో సర్వే చేసి ఏ రైతుకు ఎంత ఉన్నదో నిర్ధారించి, దాని ప్రకారమే ప్రయోజనాలు కల్పిస్తారు.
- జిల్లా కలెక్టర్, సీసీఎల్‌ఏ సదరు భూములకు సంబంధించి నిషేధ జాబితా నుంచి తొలగించేందుకుగాను చేయాల్సిన దరఖాస్తులను కంపెనీ తరఫున ఫైల్ చేసేందుకు రైతులు కంపెనీకి అధికారాలు ఇస్తున్నారు.
- ప్రస్తుతం జరిగిన ఒప్పందం ప్రకారమే భూములను కంపెనీకి అప్పగించేందుకు రైతులు అంగీకరిస్తున్నారు. తదుపరి రెవెన్యూ, ఇతర శాఖల నుంచి ఎన్‌వోసీ తీసుకురావడం, ప్రభుత్వం నుంచి ఏదైనా జీవో తీసుకువచ్చే వరకు కంపెనీయే ఆ భూములను స్వాధీనం చేసుకొని వ్యవహారాన్ని కొనసాగిస్తుంది. తర్వాత రైతులు వారి వారసులు సదరు భూములను కంపెనీ పేరిట సేల్ డీడ్ చేయాలి.
- ఈ వ్యవహారం పూర్తయ్యేందుకు ఎలాంటి గడువు ఉండదు.
- రైతులు, వారి పూర్వీకులు ఈ భూములపై ఇతరులతో ఎలాంటి ఒప్పందాలు చేసుకున్నా, ఇతర సమస్యలు వచ్చినా రైతుల సొంత ఖర్చులతోనే పరిష్కరించుకోవాలి. ఒకవేళ కంపెనీ నుంచి డబ్బులు వెచ్చిస్తే ఆ మొత్తాన్ని రైతులకు ఇచ్చే దాని నుంచి మినహాయించాల్సి ఉంటుంది.
- రైతులు ఈ భూములను కంపెనీ పేరిట మార్చేందుకు అన్నివిధాలుగా న్యాయపరంగా సహకరించాలి. కంపెనీకి చెందిన డైరెక్టర్ల పేరిట పాస్ పుస్తకాలు పొందేందుకు, వారి పేరిట ఎన్‌వోసీగాని ప్రభుత్వం నుంచి జీవోగాని వచ్చేందుకు రైతులు అంగీకరిస్తున్నారు. రైతులు తమ వారసత్వ ధ్రువీకరణ పత్రం (ఫ్యామిలీ ట్రీ సర్టిఫికెట్)ను ఈ ఒప్పందం జరిగిన నెలలో కంపెనీకి సమర్పించాలి.
- రైతుల పేరిట అన్నిరకాలుగా ఎన్‌వోసీ, పాస్‌పుస్తకాలు వచ్చిన తర్వాత ఆ భూములను కంపెనీకి ఏజీపీఏ (అడిషనల్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ) చేసేందుకు రైతులు అంగీకరించారు.

సమ్మె దిశగా ఏఈవోలు!

వ్యవసాయ కార్యదర్శితో చర్చలు విఫలం
సమస్యలపై చేతులెత్తేసిన ఉన్నతాధికారి
మూకుమ్మడి సెలవు దిశగా అడుగులు

హైదరాబాద్, అక్టోబర్ 30(నమస్తే తెలంగాణ): వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈవో)లు మళ్లీ సమ్మె దిశగా అడుగులు వేస్తున్నారు. బుధవారం వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. తమ సమస్యల పరిష్కారానికి అధికారుల నుంచి ఎలాంటి హామీ లభించలేదని ఏఈవోలు తెలిపారు. దీంతో సమ్మె చేయక తప్పని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2600 మంది ఏఈవోలు మూకుమ్మడిగా సెలవు పెట్టేందుకు యోచిస్తున్నట్టుగా తెలిసింది. సర్వే చేయడం ప్రారంభిస్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు చేతులెత్తేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఏఈవోల సమస్యల పరిష్కారంపై వ్యవసాయ శాఖ కార్యదర్శి చేతులెత్తేసినట్టుగా తెలిసింది. ప్రస్తుత పరిస్థితుల్లో తానేమీ చేయలేనని స్పష్టం చేసినట్టుగా తెలిసింది. 'మీ ఇష్టముంటే సర్వే చేయండి. లేదంటే చేయకండి.' అంటూ తేల్చి చెప్పినట్టుగా తెలిసింది. ఇక ఏఈవోలపై సస్పెన్షన్ ఎత్తివేతపైనా కార్యదర్శి స్పష్టమైన హామీ ఇవ్వలేదని తెలిసింది. వ్యవసాయ శాఖ అధికారుల తీరుపై ఏఈవోలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమను ఇబ్బందులకు గురి చేయాలనే ఆలోచనే తప్పా.. సమస్యలు పరిష్కరించి.. పని చేయించుకోవాలనే దిశగా ఆలోచించడంలేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వారం క్రితమే సమ్మెకు వెళ్లాలని భావించామని, హామీతో విరమించుకున్నట్టు తెలిపారు. ఇప్పుడు సమస్యల పరిష్కారంపై చెతులెత్తేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల మొండి వైఖరికి నిరసనగా మూకుమ్మడి సెలవు పెట్టేందుకు ఆలోచన చేస్తున్నామని ఏఈవో సంఘం నేతలు తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై ఆదిలోనే ఎదురుదెబ్బ

ముందే చెప్పిన 'నమస్తే తెలంగాణ'

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): బీసీ రిజర్వేషన్ల అంశంపై ఆదిలోనే తొలి దెబ్బ తగిలింది. కాంగ్రెస్ సర్కార్ ఒంటెత్తు పోకడలతో కుట్రపూరిత వైఖరి బట్టబయలైంది. బీసీ మేధావులు, న్యాయకోవిదులు ఊహించినట్టుగానే రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్ల అమలుకు అనేక న్యాయపరమైన అడ్డంకులు ఉన్నాయని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఉన్నాయని 'నమస్తే తెలంగాణ' ముందే హెచ్చరించింది. దీనిపై పలు కథనాలను ప్రచురించింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కులగణన సర్వేకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసిన క్రమంలో అందులోని విధానపర లోపాలను, న్యాయపరమైన అంశాలను 'నమస్తే' ఎలుగెత్తి చాటింది. సుప్రీంకోర్టు నిబంధనలకు పూర్తివిరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతున్నదని, న్యాయపరమైన ఇబ్బందులు తప్పబోవని ముందే హెచ్చరించింది. 'కుల సర్వే చట్టం ముందు నిలిచేనా?', డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాల్సిందే అంటూ చాలా స్పష్టంగా తెలియజెప్పింది. అయినా సర్కారు దిద్దుబాటు చర్యలు చేపట్టలేదు. మరోవైపు రాష్ట్ర బీసీ కమిషన్ సైతం విచారణ అంటూ జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టింది. అభిప్రాయ సేకరణ చేపడుతూ హడావుడి చేస్తున్నది.

ఇద్దరు కలెక్టర్లపై కమిషన్ ఆగ్రహం

సంగారెడ్డి, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): మెదక్, సిద్దిపేట కలెక్టర్లపై బీసీ కమిషన్ చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సంగారెడ్డిలో నిర్వహించిన బీసీ కమిషన్ అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి వారు రాకపోవడంపై కమిషన్ చైర్మన్ నిరంజన్ మండిపడ్డారు. మెదక్, సిద్దిపేట కలెక్టర్లకు బీసీ కమిషన్ తరఫున నోటీసులు జారీ చేస్తామని పేర్కొన్నారు.



నవంబర్ 30లోపు కులగణన

గాంధీభవన్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): నవంబర్ 30లోపు కులగణన పూర్తి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆ తర్వాత ఎన్నికల యుద్ధానికి సిద్ధం కావాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో బుధవారం కులగణనపై పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కులగణనపై సోనియా, రాహుల్‌గాంధీ మాట ఇచ్చారని, ఆ మాటను నెరవేర్చాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఈ క్రమంలో ఎవరు అభ్యంతరకరంగా వ్యవహరించినా వారిని పార్టీ క్షమించదని హెచ్చరించారు. కులగణనపై సమన్వయం చేసుకునేందుకు పార్టీ నుంచి 33 జిల్లాలకు 33 మంది అబ్జర్వర్స్‌ను నియమించాలని సూచించారు. కులగణనలో దేశానికి తెలంగాణను ఒక మోడల్‌గా చూపించాలని అన్నారు. పార్టీకి నష్టం చేకూర్చేలా ఎవరైనా ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదని పరోక్షంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను ఉద్దేశించి హెచ్చరికలు జారీచేశారు.

బీసీ రిజర్వేషన్లకు డెడికేటెడ్ కమిషన్

▸ మొదటిపేజీ తరువాయి...



సంబంధించిన బాధ్యతలను బీసీ కమిషన్ నుంచి తప్పించాలని, అందుకోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటుచేయాలని, ఆ మేరకు రాష్ట్ర సర్కార్‌కు ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ తరఫు న్యాయవాది, మాజీ అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదించారు. బీసీ రిజర్వేషన్లపై గతంలో సుప్రీంకోర్టు జారీచేసిన మార్గదర్శకాలను, పలు రాష్ట్రాల హైకోర్టులు ఇచ్చిన ఉత్తర్వులను సోదాహరణంగా వివరించారు.

బీసీ రిజర్వేషన్లే లేకుండాపోతాయి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించే బాధ్యతలను బీసీ కమిషన్‌కే రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిందని, అదే 'డెడికేటెడ్ కమిషన్'గా వ్యవహరిస్తుందని పేర్కొనడంపై బీఎస్ ప్రసాద్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్లలో ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా ఉండేందుకు, బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణకు సంబంధించిన బాధ్యతల నుంచి బీసీ కమిషన్‌ను తప్పించాలని కోరారు. అందుకోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసేవిధంగా తెలంగాణ సర్కార్‌కు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తిచేశారు. రిజర్వేషన్ల బాధ్యతను బీసీ కమిషన్‌కు అప్పగించడం సుప్రీంకోర్టు ఐదుగురు జడ్జిల ధర్మాసనం ఇచ్చిన తీర్పుకు విరుద్ధమని నొక్కిచెప్పారు. ఈ సందర్భంగా రెండు కేసుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఉటంకించారు. రాష్ట్ర చట్టాల ద్వారా కల్పించే అధిక, అసమాన రిజర్వేషన్లు న్యాయస్థానాల ఎదుట నిర్దిష్ట సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని, అదే సమయంలో బీసీలకు అనుకూలంగా రిజర్వేషన్లు కల్పించే రాజ్యాంగ నిబంధనలైన ఆర్టికల్స్ 243-డీ(6), 243-టీ(6)లను కొట్టివేయడాన్ని కూడా సమర్థించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని తెలిపారు. రిజర్వేషన్ల ప్రయోజనం కోసం వెనుకబడిన తరగతులను గుర్తించడం అనేది కార్యనిర్వాహక విధి అని ధర్మాసనం తేల్చిచెప్పిందని గుర్తుచేశారు. వెనుకబాటుతనం స్వభావం, సవాళ్లపై క్షేత్రస్థాయి అధ్యయనం, విచారణను నిర్వహించేందుకు ఆర్టికల్ 340 ప్రకారం ప్రత్యేక కమిషన్లను నియమించాల్సిన అవసరమున్నదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని హైకోర్టుకు వివరించారు. ఓబీసీలకు స్థానికసంస్థల్లో సీట్లను రిజర్వు చేయడానికి ఇదివరకు జారీచేసిన ట్రిపుల్ టెస్ట్ షరతులను రాష్ట్రం పాటించాలని, అందుకు డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు మరో కేసులో నొక్కి చెప్పిందని వివరించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో మహారాష్ట్ర ప్రభుత్వం జయంత్‌కుమార్ భాటియా నేతృత్వంలో డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటుచేసిందని గుర్తుచేశారు. డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయకుండా బీసీ రిజర్వేషన్లను స్థిరీకరిస్తే అవి చెల్లుబాటు కాకుండా పోతాయని, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లే లేకుండా పోతాయని వివరించారు. న్యాయపరమైన ఆటంకాల్లేకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని విన్నవించారు.

రెండు వారాల్లో ఏర్పాటుచేయాలి

ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలను వినిపించారు. బీసీ కమిషన్‌కే డెడికేటెడ్ కమిషన్‌గా అధికారాలు కల్పించామని వివరించారు. దీంతో మరోసారి బీఎస్ ప్రసాద్ జోక్యం చేసుకుంటూ ఏజీ వాదనలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం 340 అధికరణ ద్వారా డెడికేటెడ్ కమిషన్‌ను మాత్రమే ఏర్పాటు చేయాల్సి ఉంటుందని చెప్పారు. ప్రస్తుతమున్న బీసీ కమిషన్‌కే డెడికేటెడ్ కమిషన్ అధికారాలు కట్టబెట్టడం సుప్రీంకోర్టు ఆదేశాలకు పూర్తి విరుద్ధమని తేల్చిచెప్పారు. ఇరువురి వాదనల అనంతరం జస్టిస్ ఎస్ నంద పిటిషనర్ ఆర్ కృష్ణయ్య లేవనెత్తిన వ్యాజ్యంలోని అంశాలను సమర్థించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కల్పించాల్సిన రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించేందుకు సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించాలని ప్రభుత్వానికి స్పష్టంచేశారు. సుప్రీం మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాలని తేల్చి చెప్పారు. రాష్ట్రంలో కూడా ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. రెండు వారాల్లో స్థాయి నివేదికను న్యాయస్థానానికి సమర్పించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. తదుపరి విచారణను నవంబర్ 21వ తేదీకి వాయిదా వేశారు.

డెడికేటెడ్ కమిషన్‌ను నియమించాలి: ఆర్ కృష్ణయ్య



ముషీరాబాద్, అక్టోబర్ 30: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల శాతం నిర్ణయించడానికి ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను నియమించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర బీసీ కమిషన్‌కే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించేందు ప్రత్యేక బాధ్యతలను అప్పగించిందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. తాము హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని వేశామని, తమ వాదనలు విన్న కోర్టు పలు సూచనలు చేసిందని చెప్పారు.

డెడికేటెడ్ కమిషన్‌నే ఏర్పాటు చేయాలి: దాసు సురేశ్

బీసీ రిజర్వేషన్ల అంశంపై డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ కోరారు. మేధావులు, న్యాయకోవిదుల అభిప్రాయాలు స్వీకరించకుండానే ప్రభుత్వం ఒంటెత్తు పోకడతో వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు.

కులగణన ఉదయం పూటే చేస్తాం

- రెండుపూటలా సర్వే చేయడం కుదరదు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు స్పష్టంచేసిన ఉపాధ్యాయ సంఘాలు

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): కులగణన సర్వేను ఉదయం పూట మాత్రమే చేస్తామని ఉపాధ్యాయ సంఘాలు స్పష్టంచేశాయి. రెండుపూటలా సర్వేచేయడం కుదరని ముఖ్యంగా సాయంత్రం పూట సర్వే చేయలేమని ప్రభుత్వానికి తెలిపాయి. కులగణనపై ఉపాధ్యాయుల సహకారాన్ని కోరుతూ ప్రభుత్వం బుధవారం సచివాలయంలో ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సీఎస్ శాంతికుమారి, ప్రభుత్వ కార్యదర్శులు సందీప్‌కుమార్ సుల్తానియా, బుర్రా వెంకటేశం తదితరులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క కులగణన ప్రాధాన్యతను సంఘాలకు వివరించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సర్వే సమయంలో ఇబ్బందుల్లేకుండా చూడాలని, సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. నవంబర్ 10, 11, 17, 18 తేదీల్లో సెలవులు ఉన్నాయని, ఈ సెలవు దినాల్లో పనిచేస్తే సీసీఎస్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్ బిల్లులు తరహాలో సర్వే పారితోషికాన్ని కూడా పెండింగ్‌లో పెడతారా? అని ప్రశ్నించారు. సర్వే గౌరవ వేతనం విషయంలో తక్కువ చేయరాదని, ఆకర్షణీయమైన రెమ్యూనరేషన్ ఇవ్వాలని, సర్వే పూర్తికాగానే విడుదల చేయాలని కోరారు. ఇప్పటికే పెండింగ్ డీఏలు, పెండింగ్ బిల్లులు, హెల్త్‌కార్డులు సహా పలు అంశాలపై ఉపాధ్యాయులు అసంతృప్తితో ఉన్నారు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండగా, కనీసం రెండు డీఏలనైనా విడుదల చేయాలని చాలాకాలంగా కోరుతున్నారు. ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వం ఒక డీఏకే ఆమోదం తెలిపింది. దీనితో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు సర్కారుపై గుర్రుగా ఉన్నాయి. ఉపాధ్యాయులు సహకరించకపోతే, ఇబ్బందులు తలెత్తుతున్నాయనే శాంతపరిచే ప్రయత్నం చేసింది.

సమస్యల సంగతేమిటి?

కులగణనపై నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయ సంఘాలు తమ సమస్యల సంగతేంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. తమ సమస్యలను పరిష్కరించాలని ముక్తకంఠంతో విజ్ఞప్తి చేశారు. సమావేశానికి పీఆర్టీయూటీఎస్ నుంచి శ్రీపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, హెచ్‌ఎం అసోసియేషన్ నుంచి రాజభానుచంద్రప్రకాశ్, టీఆర్‌టీఎఫ్ నుంచి కటకం రమేశ్, మారెడ్డి అంజిరెడ్డి, తపస్ నుంచి హనుమంతరావు, ఎస్టీయూటీఎస్ నుంచి పర్వత్‌రెడ్డి, ట్రైబల్ టీచర్స్ ఫోరం నుంచి ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్, బీసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు తదితరులు హాజయ్యారు. పెండింగ్ డీఏలపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వివిధ సంఘాల నేతలు మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు.

చట్టపరమైన అడ్డంకులను తొలగించాలి

బీసీ కులగణనకు నోడల్ అధికారిని నియమించాలి • ప్రభుత్వానికి మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ స్పష్టీకరణ

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): బీసీ కులగణనకు చట్టపరమైన అడ్డంకులను తొలగించాలని శాసనమండలి వైస్ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ప్రభుత్వానికి స్పష్టం చేశారు. బీసీ కులగణనపై రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా చేపడుతున్న చర్యలను ఆయన తప్పుబట్టారు. బీసీ కులగణన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని, అనుసరించాల్సిన శాస్త్రీయ అంశాల క్రోడీకరణను ఆయన బుధవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వివరించారు. ఎన్నికలకు ముందు కామారెడ్డిలో కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న ఏ ఒక్క అంశం ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదని పేర్కొన్నారు. బీసీ కులగణన విషయంలో 2024 మార్చి 15న రాష్ట్ర శాసనసభ చేసిన ఏకగ్రీవ తీర్మానాన్ని సర్కార్ తప్పుదోవ పట్టిస్తుందని, సర్వే పర్యవేక్షణకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని వివరించారు. బీసీ కులగణన విషయంలో సర్కార్ లోపభూయిష్టతను గుర్తుచేస్తూ, అనుసరించాల్సిన విధానాలు, న్యాయస్థానాల్లో నిలిచే వాదనలు తదితర అంశాలను ఆయన నోట్స్ రూపంలో అందజేశారు. బీసీ కమిషన్ కాకుండా ప్రత్యేక కమిషన్ వేయాలని తాము సూచించినా సర్కార్ పట్టించుకోలేదని తెలిపారు. ప్రభుత్వం దాటవేత ధోరణిని విడనాడి, న్యాయబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. బీహార్ ప్రభుత్వం అనుసరించిన మార్గాన్ని ఇక్కడా పాటించాలని సూచించారు.